

దారిలోనే సంత.. జరపండయ్యా కొంత..!



పూతలపట్టు సంతలో రోడ్డు పై దుకాణాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు పంచాయతీ లక్షల్లో ఆదాయం వచ్చే వారపు సంత జనంతో ప్రతి మంగళవారం కిటకిటలాడుతుంది. పలమనేరు, పాకాల, వీకోటతోపాటు మరికొన్ని మండలాల నుంచి వ్యాపారులు, రైతులు కూరగాయలు తీసుకొచ్చి సంతలో క్రయవిక్రయాలు చేస్తుంటారు. ప్రతి మంగళవారం ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు జనాల తాకిడి అధికంగా ఉంటుంది. పంచాయతీ దుకాణ సముదాయాల పక్కన ప్రధాన రహదారి మీదనే ఈ సంత జరుగుతుండడంతో రద్దీగా ఉంటుంది. దీంతో సుమారు 13 గ్రామాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు కలుగుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి.

రోడ్డుపైనే దుకాణాలు..

వ్యాపారులు, రైతులు రహదారిపైనే ఇరువైపులా పెద్దఎత్తున దుకాణాలు పెడుతుండటంతో వాహనాల రాకపోకలు పెద్దఎత్తున స్తంభించిపోతుంది. గంటలు తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఇక సాయంత్రం పూట కళాశాలలు, పాఠశాలలకు సంబంధించిన ప్రైవేటు వాహనాలతో మరిన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు పోలీసులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రోడ్డుకి ఇరువైపులా దుకాణాలు లేకుండా చేస్తే ప్రజల కష్టాలు తీరుతాయని పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఐక్య పోరాటాల సారథి సిఐటియు

నేడే సిఐటియు 9వ జిల్లా మహాసభలు



జోరువానలో సమ్మెను కొనసాగించిన అంగన్వాడీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: కార్మికుల వేగుచుక్క ఐక్య పోరాటాల రథసారథి సిఐటియు ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో ఉన్న కార్మికుల ఉద్యోగుల సమస్యలపై గత మూడు సంవత్సరాలుగా కలెక్టరేట్ కేంద్రంగా బలమైన ఉద్యమాలు చేయడం జరిగాయి. ప్రధానంగా స్కీం వర్కర్లైన అంగన్వాడీ, ఆశ, వీవోఏ తదితర కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన కార్మిక సంఘం సిఐటియు.

ప్రధానంగా గత సంవత్సరం అంగనవాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజులు సమ్మె సందర్భంగా కలెక్టర్ కలెక్టరేట్ నిర్వహించిన కార్యక్రమాలు జిల్లా చరిత్రలో నిలిచిపోతాయి. జోరు వర్షంలో కూడా రాత్రింబవళ్లు పోరాటాలు నిర్వహించిన మహిళా కార్మికులను ఐక్యం చేయడంలో సిఐటియు పాత్ర కీలకం. కలెక్టరేట్ ముట్టడికి వేలాది మంది తరలిరావడంతో పోలీసులు ఎంతగా కట్టడి చేసినా కలెక్టరేట్ చరిత్రలోనే గేట్లు తోసుకుంటూ మహిళలు లోపలికి వెళ్లారు. అధికారులు ఎన్ని అడ్డంకులు పెట్టిన సిఐటియు పోరాటాలను అడ్డుకోలేకపోయారు. అదేవిధంగా వీవోఏల సమస్యలపై గత పీడీ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ స్పందించకపోవడంతో భారీ స్థాయిలో కలెక్టరేట్ ముట్టడి చేయడంతో కలెక్టరేట్లో ఉన్న సంప్రదాయాన్ని తిరగరాస్తూ అధికారులను బయటకు రప్పించి మాట్లాడించే పరిస్థితి తీసుకొచ్చింది సిఐటియు. ఇవన్నీ కూడా ఐక్యపోరాటాలతో సాధ్యమైంది.

ఆశా కార్మికుల సమస్యలపై డిఎంయులకు కార్యాలయం వద్ద ముట్టడి చేసి ఆశా కార్మికుల పని విధానాలపై విధివిధానాలు నిర్ణయించి సర్క్యులర్లు జారీ చేసే విధంగా అధికారులు మెడలు వంచింది. ఇలా స్కీం వర్కర్ సమస్యలే కాకుండా కార్మికులైన ఆటో, హమాలీ, భవన నిర్మాణ కార్మికులు, బోయకొండ గంగమ్మ దేవస్థానం కార్మికులు, హేచరీస్ కార్మికులు ఇలా కార్మికులకు ఎక్కడ సమస్యలు వచ్చినా ఆ సమస్యలకు నాయకత్వం వహించి పరిష్కార దిశగా సిఐటియు పోరాడింది. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో సాహి గార్మెంట్ కార్మికులు తమ వేతనాల కోసం మెరుపు సమ్మెకు దిగడంతో వారికి సిఐటియు అండగా ఉంటూ ప్రత్యక్షంగా మద్దతును, భరోసాను ఇచ్చింది.





ఏర్పాట్లలో నిగమ్నమైన సిఐటియు నాయకులు



కలెక్టరేట్ ఎదుట ఉధృతమైన అంగన్వాడీల పోరాటం (ఫైల్‌ఫొటో)

నగిరిలో వేలాది మంది పవర్లూమ్ కార్మికులు కూలీలు పెంచాలని మూడు గంటల పాటు జాతీయ రహదారిని దిగ్బంధనం చేసి యాజమాన్యాల మెడలు వంచి అధికారుల సమక్షంలో ఒప్పందం చేసిన చరిత్ర సిఐటియుది. పలమనేరు ప్రాంతంలో హమాలీ కార్మికుల సమస్యలపై సుదీర్ఘమైన పోరాటం చేసింది. స్థానిక సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులను ఐక్యం చేసి ఐక్య పోరాటాల రసారథిగా నిలిచింది. పలమనేరులో మొట్టమొదటిసారి జరుగుతున్న సిఐటియు 9వ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ మహాసభల్లో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేయండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 2026 కోసం సన్నాహక కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్‌కు వివరిస్తూ.. జిల్లాలో చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈడిటిలు, ఈఎస్ఏలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026పై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటర్ మ్యాపింగ్‌కు సంబంధించి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బిఎల్ఓలను నియమించడానికి ప్రతిపాదనలు వెంటనే పంపిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అందరూ బిఎల్ఓలకు ఐడి కార్డు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో 7,77,924 ఫారమ్స్ పెండింగ్ పనులు పూర్తి చేయడం జరిగిందని, సంబంధిత బిఎల్వోలకు కార్డులు పంపిణీ చేయడం, రాజకీయ పార్టీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. శిక్షణ కార్యక్రమాలు సెప్టెంబర్ 19, నవంబర్ 21వ తేదీన నిర్వహించడం జరిగిందని వివరించారు. బుక్ ఏ కాల్ విత్ బి ఎల్ ఓ అని కార్యక్రమాలపై 117 వినతులు స్వీకరించి 109 వినతులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు.

ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): గ్రామస్థాయిలో పొదుపు మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి డిఆర్‌డిఏ సిబ్బంది, బ్యాంకు మేనేజర్లు, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్‌డిఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ బ్యాంకుల సమన్వయంతో వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై బ్యాంకుల మేనేజర్లతో, ఏపీఎంలతో ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు లింకేజీపై పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ బి.శ్రీదేవి లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ ఇండియన్ బ్యాంక్, నాబార్డ్ ప్రతినిధి ఇందిరా, ఎస్‌బిఐ ఆర్ఎం పరశురామ్, యుబిఐ ఆర్ఎం రాకేష్, కెనరా బ్యాంక్ ఆర్ఎం రామ్మోహన్, బ్యాంకు మేనేజర్లు, డిఆర్‌డిఏ ఏపీఎంల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025- 26వ ఇంకా పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ లింకేజి, ప్రభుత్వం, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాలలోని ఎస్‌హెచ్‌జి సంఘాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు నిర్దేశించిన ప్రణాళికను తయారుచేసి బ్యాంకు నుండి రుణాలు మంజూరు చేయించుటకు కృషి చేయాలని తెలిపారు. డిఆర్‌డిఏ ఏపీఎం, బ్యాంకు మేనేజర్ సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని, గ్రామస్థాయిలో ఏపీఎంలు తిరిగి పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన పొదుపు మహిళలకు రుణం మంజూరు చేయడంలో మీరు ప్రముఖపాత్ర పోషించాలని ఆదేశించారు. ఇప్పటికే వివిధ బ్యాంకులు పొదుపు మహిళలకు రుణాలు ఇవ్వడంలో చాలా వెనకబడి ఉన్నారని జనవరి లోపు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని బ్యాంకు మేనేజర్లను హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మహిళని లక్షాధికారి చేయాలని అనేక సంస్కరణలు చేపడుతున్నాడని వివరించారు. జిల్లాలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో 100 ఎస్‌హెచ్‌సి గ్రూపులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంక్ మేనేజర్ ఈ సమావేశంలో కలెక్టర్‌కి వివరించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు లబ్ధిదారులు ఎంపిక డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో కార్యక్రమాల్లో చేపట్టాలని పీడీ ఆదేశించారు. పెద్దపంజాణి, తవణంపల్లి, గుడిపాల, వి. కోట. శాంతిపురం, కార్వేటినగరం, చిత్తూరు, నగరి, రొంపిచర్ల మండలాలకు సంబంధించిన, ఏపీఎంలతో బ్యాంకు లింకేజీ పై ఆరా తీశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్ష

డ్రగ్స్ నుంచి యువతను కాపాడుకుందాం: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో గురువారం సమగ్ర శిక్ష అభియాన్‌పై యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫార్ లాబి ఎన్‌ఫోర్సుమెంట్‌పై ఈగల్ రివ్యూ మీటింగ్ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ స్థాయిలో ఆర్డీవోలు, డీఎస్పీలు ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్‌లో మాదకద్రవ్య రహితంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. యువతను డ్రగ్స్‌కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలు, కళాశాలలో యువత మత్తు పదార్థాలకు బానిస కావడం ద్వారా ఎదుర్కొనే చట్టపరమైన అనేక సమస్యల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాల ద్వారా వివరించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు పనిచేసే స్వచ్ఛంద సంస్థలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. మండల స్థాయిలో ఎంఈఓలు, పోలీస్‌శాఖ సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని డీఈఓని ఆదేశించారు. పాఠశాలలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పరచి పిల్లల ప్రవర్తన గురించి కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలియజేశారు. డ్రగ్స్ గుర్తించి తెలియజేసిన వారికి రూ.25 వేల నగదు బహుమతి ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్పీ మాటాడుతూ మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాలను నివారించడానికి ముందస్తు పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాల అవసరాలను వివరించారు. పాఠశాలల్లో, హైస్కూల్లో మాదకద్రవ్యాల నుండి విముక్తి పొందేలా చూసుకోవడానికి, అధిక నిఘా ఉండేలా చూస్తామని తెలిపారు. బస్టాండు, రైల్వేస్టేషన్, ప్రధాని కూడళ్లలో గట్టిగా నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. డ్రగ్స్ విక్రయాలు జరిపే షాపుల వివరాలు తెలియజేయాలన్నారు. సర్వ శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి, మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ విజయవాడ సంచాలకుల వారి ఆదేశాల మేరకు యుపిఎస్‌సి నిర్వహించే సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల చిత్తూరు జిల్లా వాసులకు వెనుకబడిన తరగతులు (బిసి) షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) షెడ్యూల్డ్ తెగలకు (ఎస్‌టి) చెందిన అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీసర్కిల్ సంచాలకులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి చిత్తూరు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. డిసెంబర్ 5వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడునని, అందులో ఉత్తీర్ణులైన వారికీ మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇవ్వబడునని పేర్కొన్నారు. ఇందులో బిసి 66 శాతం, ఎస్సీ 20శాతం, ఎస్టీ 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారని, ఎంపికైన వారికి విజయవాడలోని బిసి భవన్, గొల్లపూడిలో ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కు లిస్టులు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక అదాయం రూ.1,00,000లలోపు మాత్రమే) ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు బుక్కు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి నేరుగా అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు ప్రేమ్, సీనియర్ అసిస్టెంట్ 91774 29494, జె.శ్రీనివాసులు, సూపరింటెండెంట్ 852000 4646ను సంప్రదించాలని కోరారు.

మాక్ అసెంబ్లీ జిల్లా విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: మాక్ అసెంబ్లీలో చిత్తూరు జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభను ప్రదర్శించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీతుషార్ డూడి విద్యార్థులను అభినందించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడలోని శాసనసభ ఆవరణలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ ఏర్పాటు చేసిందని, ఇందులో చిత్తూరు జిల్లాకు చెందిన 21 విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని తెలిపారు. చిత్తూరు నియోజకవర్గం నుంచి కేఎం.హరిణి 9వ తరగతి, పుంగనూరు జి.పూజ, కే.మేఘన 10వతరగతి, కుప్పం జి.శృతి, వి.లోకేష్ 10వ తరగతి, నగరి ఎస్.పరిమళ 10వ తరగతి, బి.సోఫియా 9వ తరగతి, పూతలపట్టు ఎస్.ప్రవల్లిక 9వ తరగతి, ధీరజ్ కుమార్ 10వ తరగతి, పి.శశిర, పి గోవర్ధన్ 10వ తరగతి, పరిణిత, జి.నందిని 9 తరగతి విద్యార్థులను సత్కరించారు. సర్వ శిక్ష అభియాన్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి

- సంఘ సభ్యుల జీవనోపాదులు పెంచాలి: డిఆర్‌డిఏ పీడీ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాదులు పెరిగేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని చిత్తూరు డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి తెలిపారు. గురువారం డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో డిపిఎంలు, ఏపీఎంలు, సీసీలు ఇతర డిఆర్‌డిఏ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వాలంబన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను చేపట్టాయని ఈ పథకాలన్నీ సంఘ సభ్యులకు చేరువ కావాలన్నారు. అనేక పథకాలు జిల్లాలోని వివిధ శాఖలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకొని తమ పరిధిలోని సంక్షేమ ఫలాలను సంఘ సభ్యులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని దీని దృష్టిలో ఉంచుకొని క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సంఘాల్లోని చదువుకున్న సభ్యులను గుర్తించి స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న సాంఘిక దురాచారాల వల్లే చోటు చేసుకునే పరిణామాలను వివరించి వారిని చైతన్యపరిచి ఈ దురాచారాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా హార్టికల్చర్ పశు సంవర్ధక శాఖలు సంఘ సభ్యులకు అనేక పథకాలను అందించే అవకాశం ఉందని ఈ పథకాలన్నీ సంఘాలు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. మండల స్థాయి సిబ్బంది అర్హత ఉన్న ప్రతి సభ్యురాలను లక్షాధికారి చేయాలన్న సంకల్పంతో పని చేయాలని అప్పుడే జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. విధులు పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. డీపీఎం రవి, వరలక్ష్మి, ఏపీఎంలు మధుసూదన్, సుబ్బారెడ్డి, హేమ, సీసీలు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాలతో అవస్థలు



ఓవర్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వల్ల ట్రాఫిక్ అంతరాయం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలో తరచూ ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనల కారణంగా స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఎస్ఆర్‌పురంలోని ఎస్ఎన్‌జె షుగర్ ఫ్యాక్టరీకి పుత్తూరు, వెదురుకుప్పం, రామచంద్రాపురం మండలాల నుంచి అధికంగా చెరకు లోడ్ కార్వేటినగరం మీదుగా తరలిస్తూ ఉంటారు. ఇలా వచ్చే ట్రాక్టర్లు ఓవర్ లోడ్‌తో వస్తూ ఉండటంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. లోడ్‌తో వచ్చే వాహనం వెళ్లే వరకూ వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయి బారులుతీరిన వాహనాలు గంటల సయమం వేచి ఉండాల్సి వస్తోంది. రోజు ఉదయం, సాయంత్రం స్కూల్స్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలు, పనులకు వెళ్లే వారికి ప్రతిరోజూ ఈ అవస్థ తప్పడం లేదు.

కార్వేటినగరం పుత్తూరు మార్గమధ్యంలోని కణం వద్ద ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు వ్యక్తులు మరణించారు. అయినా కూడా ఓవర్ లోడ్‌తోనే ట్రాక్టర్లు ప్రయాణిస్తున్నాయి. వీటివలన వారితోపాటు చుట్టుపక్కల వారికి ప్రమాదం లేకపోలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న ట్రాక్టర్లు, లారీల డ్రైవర్లు, యజమానులపై తగ్గిన చర్యలు తీసుకోవాలని, ఓవర్ లోడ్ తగ్గించి ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భూపతికి అశ్రునివాళి..!


పాడె మోసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వి.భూపతి విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం విధితమే. సీఎం చంద్రబాబు నాయుడు టిడిపి వీరాభిమాని భూపతి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. వీర్నమలలో వార్డు మెంబర్, గ్రామ పార్టీ అధ్యక్షులుగా ప్రజలకు భూపతి విశేష సేవలు అందించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కార్యకర్తలు కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గురువారం భూపతి అంత్యక్రియల్లో పాల్గొని భావోద్వేగానికి గురై కంటితడి పెడుతూ పాడె మోశారు. అంత్యక్రియల్లో కూటమినేతలు వందల సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల పార్టీకి తీరని లోటని అన్నారు. చిన్న వయసులోనే టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తూ పేదప్రజలకు సహాయ సహకారాలు అందించారన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. భూపతి మృతితో వీర్నమల ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. నివాళులు అర్పించిన వారిలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, చలపతి, చిన్న కృష్ణ, కృష్ణ నాయక్, కామరాజ్ నాయక్, విశ్వనాథ్, జయశంకర్, జైయి, గంట్లప్ప గౌడు, మహమ్మద్ రఫీ, పాండియన్ పాల్గొన్నారు.

శ్రీవారి బిల్డింగ్ సొల్యూషన్స్ ప్రారంభం

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం హర్షణీయం: ఎమ్మెల్యే గురజాల



శ్రీవారి బిల్డింగ్ సొల్యూషన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలోని పలువురు ఔత్సాహక పారిశ్రామికవేత్తలు మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం హర్షనీయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రశంసించారు. చిత్తూరు ఏఎస్ఎమ్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీవారి బిల్డింగ్ సొల్యూషన్స్ సంస్థను ఎమ్మెల్యే గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తాము పుట్టి పెరిగిన ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేలా చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి తమ వంతు సహకరించాలన్నారు. శ్రీవారి బిల్డింగ్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లగుండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ నగర పరిసరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు అవుతతుండడంతో గంగాధరనెల్లూరు మండలం, పెద్దకాల్వ పెద్ద గ్రామానికి చెందిన తాను 100 మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చిత్తూరు నగర పరిసరాల్లో శ్రీవారి బిల్డింగ్ సొల్యూషన్స్ సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే తమ హైదరాబాదు బ్రాంచ్‌లో నెలకు 300 టన్నుల వేర్ హౌస్ ఆర్టికల్స్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి నగరంలోనూ తమకు బ్రాంచ్ ఉందని, తాజాగా చిత్తూరు రూరల్ మండలంలో తాము నెలకొల్పనున్న పరిశ్రమలో నెలకు 1000 టన్నుల వేర్ హౌస్ ఆర్టికల్స్ తయారు చేసే అవకాశం ఉందన్నారు. తమ కంపెనీ దాదాపు 5వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వేర్ హౌసెస్, గోడౌన్స్, కమర్షియల్ బిల్డింగ్స్ నిర్మాణం, ఫ్యాబ్రికేషన్, సివిల్ వర్కులు చేస్తామన్నారు. తక్కువ ధరతో వినియోగదారునికి లబ్ధి చేకూరేలా తమ నిర్మాణాలు ఉంటాయని, ఈ అవకాశాన్ని చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాల్లోని ఆయా ప్రీ ఇంజనీరింగ్ బిల్డింగ్స్, వివిధ షోరూములు, ఫ్యాక్టరీలు, గోడౌన్లు, వేర్ హౌసెస్ నిర్మాణాలను చేయతలపెట్టిన వారు సద్వినియోగం చేసుకోవాలని చల్లగుండ్ల దీపక్ చౌదరి కోరారు. శ్రీవారి బిల్డింగ్ సొల్యూషన్స్ భాగస్వామి చల్లగుండ్ల ఉత్తేజ్ చౌదరి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ, తెలుగు యువత మాజీ అధ్యక్షులు డిష్ సురేష్, నగర టిడిపి అధ్యక్షులు నరేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి టి.పచ్చప్ప పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న పలమనేరు రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ గురువారం పర్యవేక్షించారు. నగరంలో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని ఉద్దేశంతో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ బుధవారం రోడ్డు విస్తరణ పనులను పూజ చేసి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పనులను వేగంగా చేపట్టాలని, దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల రోడ్డు విస్తరణకు అవసరమైన మేర స్థలాన్ని గుర్తించి మార్కింగ్ చేయాలన్నారు. ఇప్పటికే మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు సంబంధించి ప్రహరీలను తొలగించే పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గురువారం పశు వైద్యశాల, కణ్ణన్ కాలేజీలకు సంబంధించి ప్రహరీ తొలగించే పనులను పరిశీలించి, ప్రణాళికశాఖ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఇప్పటివరకు 810 మీటర్ల మేర ప్రహరీలను తొలగించినట్లు ఏసీపీ నాగేంద్ర వివరించారు. కార్యక్రమంలో ప్రణాళిక విభాగం అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షుడి ఎంపిక

ప్రజాశక్తి -కుప్పం: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు చిత్తూరు డిసిసి అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందని ఏఐసీసీ సెక్రటరీ, తమిళనాడు మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పర్యటించి కార్యకర్తల అభిప్రాయం మేరకే ఓ మంచి నాయకుడిని డిసిసి అధ్యక్షుడు కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీ క్యాడర్ను మరింత బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ తనదైన ముద్ర వేసుకుని ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ మరింత బలం పుంజుకుని అధికారంలోకి వస్తుందని పార్టీని గ్రామీణస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. కార్యకర్తల అభీష్టాన్ని తెలుసుకుని జిల్లా అధ్యక్షుడిని నియమించడం జరుగుతుందని అందులో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. మరో పదిరోజుల్లో జిల్లా అధ్యక్షుడి నియామకం గురించి పార్టీ హై కమాండ్‌కు తెలియజేస్తామన్నారు. ఏఐసీసీ వైస్ చైర్మన్ రామ్ గోపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ దామోదర్ రావు, చిత్తూరు డిసిసి అధ్యక్షులు భాస్కర్, కుప్పం ఇంచార్జ్ ఆవుల గోపి, మున్సిపల్ అధ్యక్షులు నిజాం, మండల అధ్యక్షుడు మునుస్వామి, మైనార్టీ అధ్యక్షులు ఇర్ఫాన్ పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

పంచాయతీలకు రూ.75,500లు ఆదాయం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న చేపల చెరువులను డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, సర్పంచ్ రవిచంద్ర గౌడ ఆధ్వర్యంలో గురువారం వేలం పాట నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు పోటాపోటీగా పాటలో పాల్గొని చెరువులు స్వాధీనం చేసుకున్నారు. వేలం ద్వారా పంచాయతీకి రూ.53,000 ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. అలాగే కడపనాథం పంచాయతీ పరిధిలోని చెరువులను డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున, పంచాయతీ కార్యదర్శి రూప దేవి అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. వేలంపాట వల్ల పంచాయతీకి రూ.22,500లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. నటరాజ్ శెట్టి, రమేష్ రెడ్డి, కళ్యాణ్, రాజప్ప, ప్రభాకర్ రెడ్డి, కేశవ పాల్గొన్నారు.

శెట్టిపల్లెలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి- గుడిపాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పంకు చెందిన జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఎల్‌బి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమీప గుడిపల్లి మండలం శెట్టిపల్లి గ్రామపంచాయతీలో వారంరోజుల పాటు స్పెషల్ క్యాంపు నిర్వహిస్తునట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి చిదంబరం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జడ్పీ హైస్కూల్ శెట్టిపల్లిలో క్యాంపు ప్రారంభించి పాఠశాల ఆవరణలోని చెట్లకు పెయింట్తో అందమైన బొమ్మలను వేయించినట్లు తెలిపారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులకు వివిధ రకాల సృజనాత్మక నైపుణ్యంతో కూడిన చిత్రాలను వేయడానికి గల మెలకువలను నేర్పించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ఎల్లప్ప, పాఠశాల ఇన్చార్జి హెడ్ మాస్టర్ మోహన్, పంచాయతీ సెక్రటరీ దేవేంద్ర, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ వి.నారాయణమూర్తి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఏ.చంద్రబాబు, డాక్టర్ జి.నాగరాజు, ఎల్లప్ప, సి.శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అమేట్స్ సంస్థ పది కంప్యూటర్లు ఒక ప్రింటర్ను వితరణగా అందజేసింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం అమేట్స్ సంస్థ కంప్యూటర్లను అందించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి అమేట్స్ సీఈఓ దశరథ రామిరెడ్డి దాతృత్వాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కంప్యూటర్ విద్యలో రాణించేందుకు ఉపయోగపడుతుందన్నారు. దశరథ రామిరెడ్డి తమ సంస్థ అందించిన కంప్యూటర్లను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదవిద్యార్థుల కోసం తమ సంస్థ ద్వారా కంప్యూటర్లను బహుకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీనాథ్ రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ భానుప్రకాష్, సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

రైతన్నా మీ కోసం కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండలంలోని గోపిశెట్టిపల్లి పంచాయతీ పరిధిలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు ఇంటికి వెళ్లి రైతులకు కరపత్రాలను అందజేసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గురించి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సోదరులు రాజా, సింగిల్ విండో ప్రెసిడెంట్ జనార్ధన్ రాజు, క్లస్టర్ ఇంచార్జ్ రాజేంద్ర రెడ్డి, ముని కృష్ణయ్య, హేమంత్ రెడ్డి, రవి యాదవ్, రాజా, సోమశేఖర్ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: రైతుల బాగు కోసమే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు అన్నారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ దాసరపల్లి, ఆరుమాకలపల్లి గ్రామాలలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, జిల్లా టిఎన్టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, నరసింహనాయుడు, నీరజాక్షులు రెడ్డి, బాబు నాయుడు పాల్గొన్నారు.

సోమల: నేటి కాలానికి అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక వ్యవసాయం, యాంత్రీకరణ ద్వారా వ్యవసాయం చేసే విధంగా మొగ్గు చూపాలని సోమల సింగిల్ విండో డైరెక్టర్ అష్రఫ్ అలీ అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా నంజంపేట గ్రామంలో కరపత్రాలను ప్రతి ఇంటికి పంచిపెట్టి ప్రస్తుతం ప్రభుత్వం రైతుల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ కేంద్రంలో గురువారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తనాలను అర్హులైన రైతులకు వ్యవసాయ అధికారి గీతా కుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అందించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భువనచంద్ర గౌడ్, మంజునాథ్ రెడ్డి, నాగరాజు నాయుడు, పి.రఘుచంద్రగుప్త, జి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): నరసింగరాయునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల సంరక్షణ, చట్టాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ధనంజయ అధ్యక్షత వహిస్తూ విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ లీగల్ ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమహక్కుల పరిరక్షణ బాధ్యతల గురించి తెలుసుకోవాలని మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. ఎన్‌జీఓ సభ్యులు శామ్సన్, పోలీసు సురేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శరశ్చంద్రశేఖర్, అధ్యాపకులు వినాయక, మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పలమనేరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలమనేరులో వైఎస్సార్సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు కె.నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం పి.పి.పి. విధానంపై తప్పక పునరాలోచన చేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు, విద్యార్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీ కోటి సంతకాలకు పిలుపునిస్తే అంతకు రెట్టింపుగా సంతకాల కార్యక్రమాలకు పాల్గొంటున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షులు సోమచంద్రారెడ్డి ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సిఐగా నిత్యబాబు



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఇంచార్జ్ సిఐగా నిత్యబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈస్ట్ సిఐగా విధులు నిర్వహిస్తూ గంగాధర నెల్లూరు ఇన్చార్జి సిఐగా నిత్య బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ శ్రీనివాసంతి ఇంతకుముందు పనిచేసిన డీటీ ఆర్బీకి బదిలీ అయ్యారు.

తవణంపల్లిలో నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి- తవణంపల్లి: పూతలపట్టు నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడానికి టీడీపీ నేతృత్వంలో 28వతేదీ శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలం పార్టీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కలికిరి మురళి మోహన్ పాల్గొని ప్రజల వినతులను సేకరించి, సంబంధిత శాఖ అధికారుల ద్వారా వేగవంతమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకోనున్నారని తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం (బాలికల) కళాశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. గ్రంథాలయ వారోత్సవ వేడుకల సందర్భంగా గురుకులం విద్యార్థులకి సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50 స్టూల్స్‌ను, కొన్ని పుస్తకాలను విరాళంగా ఇవ్వడం జరిగింది.

పర్యావరణ పరిరక్షణ పై సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోటి మొక్కలు నాటించాలని సదుద్దేశంతో ఐదు సంవత్సరాలుగా ప్రపంచమంతట సైకిల్ యాత్ర చేస్తూ చెట్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ తెలిపారు. గురువారం గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, టిడిపి మండల అధ్యక్షులు స్వామిదాస్ ముత్తు సిల్వన్‌కు ఘన స్వాగతం పలికి అభినందించారు. ప్రపంచంలోని ఇతర దేశాల్లో సైతం సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు ముత్తు సెల్వన్ తెలిపారు. సింగల్ విండో డైరెక్టర్ చిన్న, సెక్రటరీ కిరణ్ పాల్గొన్నారు. అదేవిధంగా ముత్తు సెల్వన్ గంగాధర నెల్లూరు పోలీస్ స్టేషన్లో ఇంచార్జ్ సీఐ నిత్య బాబు కలిశారు.

పార్కింగ్ రుసుం రద్దు చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో వాహనాల పార్కింగ్ ఫీజును రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, నగర కార్యదర్శి విసి.గోపినాథ్ మాట్లాడుతూ చిత్తూరులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్యం చేసుకోవడానికి జిల్లా నలుమూలల నుండి వస్తున్న పేషెంట్లు, అటెండెర్లు ద్విచక్రవాహనాలు, ఆటోలు, కారుకు పార్కింగ్ ఫీజు వసూళు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ ధర్మాస్పత్రిలో ఇలా పార్కింగ్ వసూళు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. తిరుపతి జిల్లాలో పెద్ద హాస్పిటల్ అయినా రుయా ఆసుపత్రిలో కూడా గేటు వసూలు లేవని, మరి ఇక్కడ ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆస్పత్రిలో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ ప్లేస్‌ను కేటాయించి సెక్యూరిటీకి బాధ్యత అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి

బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

వ్యవసాయానికి సంబంధించిన కౌలు రైతులకు వివిధ రకాల రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోవీడియో కాన్ఫరెన్స్ సమావేశం హల్‌లో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశం డిసిసి, డిఎల్ఆర్ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి కౌలు రైతులకు వివిధ రకాల రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే సంక్షేమ పథకాలకు ఎస్‌బిఐ, సప్తగిరి గ్రామీణ, బ్యాంక్, కెనరా, యూనియన్, ఇండియన్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసి, ఇతరత్రా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి బ్యాంకుల సహకరించాలని, ఈ దిశగా బ్యాంకులు పనిచేయాలన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు పంట పెట్టుబడిగా అవసరమైన పంటలకు రుణాలు, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమకి షార్ట్ టర్మ్ క్రాప్ ప్రొడక్షన్, వెలుగు/ డిఆర్డిఏ గ్రూప్ సభ్యులకు గ్రూప్ సభ్యులకు సూక్ష్మరుణాలు, వారికి ఎంటర్ ప్రినూర్ డెవలప్మెంట్ లోన్లు మంజూరులో ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయటకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. అలాగే పంటల పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా మేలు జరిగేలా అర్హులైన లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయాలన్నారు. ఆర్‌బిఐ ఏపిఆర్ఓ రోహిత్ అగర్వాల్, ఎల్‌డిఎం హరీష్, డిసిసి కన్వీనర్ ఇంద్రరా, డిఆర్‌డిఎ పీడీ శ్రీదేవి, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు: రైతన్నలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తోందని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పలమనేరు అటవీ రేంజ్ పరిధిలోని వీ.కోట, బైరెడ్డిపల్లి గంగవరం, పలమనేరు రూరల్ మండలాలకు చెందిన అటవీ ప్రాంత గ్రామాల రైతులకు పంట నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 92 మంది రైతులకు రూ.9.60 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు మూడు నెలలలోనే పరిహారపు చెక్కులను అందించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తున్నదని అన్నారు. ఏనుగుల దాడులను నివారించేందుకు చేపట్టాల్సిన అన్ని రకాల చర్యలను తీసుకోవడం జరిగిందని, అటవీ ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ అధికారుల సలహాల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, టిడిపి నాయకులు సోమశేఖర్ గౌడ్, నాగరాజారెడ్డి, ఆర్బిసి కుట్టి, సబ్ డీఎఫ్వో వేణుగోపాల్, ఎఫ్ఆర్వో నారాయణ, డిఆర్వో సలా ఉద్దీన్ పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను మరింత సుస్థిరంగా, సురక్షితంగా మార్చి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వాతావరణం కల్పించేందుకు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆటో డ్రైవర్లు తరచుగా చేసే తప్పిదాలు, వాటి వల్ల ప్రజలకు జరిగే అసౌకర్యాలు, ప్రమాదాల అవకాశాలు వంటి అంశాలను స్పష్టంగా వివరించారు. రాష్ డ్రైవింగ్ చేస్తే ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఉంటాయని, వేగం నియంత్రణలో ఉంచి, రోడ్డు పరిస్థితులను గమనిస్తూ వాహనం నడపాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే జరిమానాలు, కేసులు, లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ అంకితభావం పాటించాలని, అధిక చార్జీలు వసూలు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. అలాగే ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించడం అత్యంత ప్రమాదకరమని, ఇలాంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతాయని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ లక్ష్మీనారాయణ

పిటీషనర్ల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

నగరి ఆర్డీవో అనుపమ

ప్రజాశక్తి- కార్వేటినగరం: పీజీఆర్ఎస్ కింద ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉంచుకున్న అర్జీలను సత్వరమే పరిష్కరించి వారికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నగరి ఆర్‌డిఓ డాక్టర్ అనుపమ తెలియజేశారు. ఈ మేరకు ఆర్‌డిఓ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం పిజిఆర్ఎస్ పిటీషనర్లతో చర్చించి వారి సమస్యలను తెలుసుకుని, రికార్డులను పరిశీలించి రికార్డుల మేరకు వారికి తగు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్ కింద ఒకే వ్యక్తి ఫోన్ నెంబర్‌పై అన్నూరు, కేఎం.పురం లెక్కదాకల భూములకు సంబంధించి 29మంది దరఖాస్తు చేసుకున్నారు. పిటిషనర్ల దరఖాస్తులను పరిశీలించి ఫోన్ చేస్తే ఒకే వ్యక్తి ఫోన్ నెంబర్ ఉన్నట్లు తెలియడంతో పిటీషనలతో పాటు ఫోన్ నెంబర్ గల వ్యక్తిని కూడా కార్యాలయానికి పిలిపించి ఆర్డిఓ విచారించి సమస్యలను ఎవరైతే తెలియజేస్తారో వారి నెంబర్లే పిటిషన్లు నమోదు చేయాలని ఇతర వ్యక్తుల ఫోన్ నెంబర్లు నమోదు చేయకూడదని పిటిషనర్లకు ఆర్‌డిఓ సూచించారు. పిటిషనర్ల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు తామంతా కృషి చేస్తున్నామని ఆర్‌డిఓ ఆశాభావం వ్యక్తం చేశారు. తహశీల్దార్ కే.నాగరాజు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ స్వరూప రాణి, సర్వేయర్ మార్కొండయ్య, ఆర్ఐ టి.నరసింహులు, వీఆర్వో మోహన, విలేజ్ సర్వేయర్లు నేతాజీ, నవీన్ పాల్గొన్నారు.



పిటీషనర్ల సమస్యలపై చర్చిస్తున్న ఆర్డీవో అనుపమ

పొగాకు విక్రయాలపై దాడులు

83 కేజీల నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగరంలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని ఆరోపణలతో గురువారం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, పోలీసుశాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గురువారం చిత్తూరు నగరంలో పోలీస్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఖైనీ వంటి పొగాకు ఉత్పత్తులతో పాటు కూల్ లిప్ అనే మత్తు మిశ్రమాన్ని కలిపి పాఠశాల విద్యార్థులు తినే బండారాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఇలాంటి నిషేధిత తినుబండారాలను విక్రయిస్తున్న షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, నగర వన్ టౌన్ టూ టౌన్ సిఐలు మహేశ్వర, నెట్టికంటయ్య హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలతో పాటు ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల సమీపాల్లోని దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఎప్పటినుండో నగరవాసులు కోరుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న చిత్తూరు నగరానికి తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుండి నిషేధిత పొగాకు ఉత్పత్తులను చాట్ మాటగా పోలీసుల కళ్ళు కప్పి సరఫరా చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా పొగాకు ఉత్పత్తులను చిత్తూరు నగరానికి తరలించడంలో స్థానికుల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న పొగాకు ఉత్పత్తులపాటు, చిన్నపిల్లలు, విద్యార్థులకు కాల్ లిఫ్ట్ అనే పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణదారులు, సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. అలాగే నిషేధిత గంజాయి ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఉంచి చిత్తూరు నగర యువత మత్తుపదార్థాల భారినపడకుండా కాపాడాలని కోరుతున్నారు.

తక్కువ నీటితో ఎక్కువ సాగు

- **సూక్ష్మనీటి సాగు పథకంతో లబ్ధి పొందుతున్న రైతన్నలు**
- **కాకర సాగుతో అధిక లాభాలు**

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా తక్కువ సాగు నీటిని ఉపయోగించి ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసి సాధారణ దిగుబడి కంటే ఎక్కువ దిగుబడిని పొందవచ్చును. అలాగే విద్యుత్, ఎరువుల వినియోగంను తగ్గించవచ్చును. ఉద్యాన, వ్యవసాయ, చెరకు, మల్బరీ, పశుగ్రాస పంటలకు నీటి వసతి గల రైతులందరికీ 100 శాతం మైక్రో ఇరిగేషన్ అమలు లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయబడుతోంది.

5 ఎకరాల లోపల ఉన్న సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీతో, ఇతర రైతులకు 90శాతం రాయితీతో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.2.18 లక్షలు, 5 నుంచి 10 ఎకరాలున్న రైతులకు 90 శాతంతో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.3.46 లక్షలు, 10 ఎకరాలకు పైబడి ఉన్న రైతులకు 50 శాతంతో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.4లక్షల రాయితీతో, 12.50 ఎకరాల వరకు బిందు సేద్య పరికరాలు ఏర్పాటు, స్ప్రింక్లర్ పరికరాలు 50 శాతం రాయితీతో అందించడం జరుగుతోంది.

జిల్లాలోని రామకుప్పం మండలం కంచనబల్ల గ్రామానికి చెందిన టి.నరేంద్ర తన పూర్వీకుల కాలం నుంచి వ్యవసాయాధారితంగా జీవనం కొనసాగిస్తున్నాడు. రైతు నరేంద్ర మాట్లాడుతూ తనకున్న మూడు ఎకరాల భూమిలో రసాయన సహిత వ్యవసాయం చేస్తున్నానని అందుకు గానూ పంట సాగుకు రసాయనాలు కొనుగోలు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవ్వడమే కాకుండా రసాయనాలు వాడడం ద్వారా భూసారం తగ్గడం, అధిక దిగుబడులు రాకుండా పోవడం వంటి సమస్యలు వచ్చేవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం ప్రకృతి వ్యవసాయం మెరుగు పరచడం, గుంటూరులో సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల నిర్వహణపై ట్రైనింగ్‌లో భాగంగా ఉత్పత్తి, ఆరోగ్య మెరుగుదల, అధిక లాభాలు వంటి ఉపయోగాలు ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రస్తుతం సేంద్రియ పద్ధతిలో కాకర పంటను పండిస్తున్నానని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా రెండు ఎకరాలకు గాను పందిరి సాగు ఏర్పాటుకు రెండు లక్షల రూపాయలు రుణాన్ని సబ్సిడీ రూపంలో ఇచ్చారని, కాకర నార్లకు గాను మూడు ఎకరాలకు మొత్తం 6వేల మొక్కలను సబ్సిడీ రూపంలో అందించారన్నారు. దాదాపుగా 32 టన్నులు పంట పండించడం జరిగిందని తద్వారా చేతికందిన పంటను అమ్మేందుకు ఇబ్బందులు పడకుండా బెంగళూరుకు చెందిన ప్రైవేట్ కంపెనీ ద్వారా ఒప్పంద ప్రాతిపదికన కొనుగోలు చేయించే విధంగా చేయడం ద్వారా కిలో ధర రూ.32లు నిర్ణయించారని పెట్టుబడి ఖర్చులు పోను దాదాపుగా రూ.5 లక్షలు లాభం పొందానని తెలిపారు.



క్రైం న్యూస్

పుదుచ్చేరిలో చోరీ.. కుప్పంలో రికవరీ

అంతర్రాష్ట్ర దొంగల కోసం కుప్పంలో పోలీసులు గాలింపు

ఇద్దరు మహిళలు అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాశక్తి -కుప్పం: పుదుచ్చేరిలో ఓ వృద్ధురాలిని మోసం చేసి 21 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10లక్షల నగదును దోచుకున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా మహిళల కోసం గురువారం పుదుచ్చేరి పోలీసులు కుప్పంలో తనిఖీలు నిర్వహించారు. సెల్ఫోన్ సిగ్నల్ ఆధారంగా పుదుచ్చేరి పోలీసులు కుప్పం మండలం కొత్త ఇండ్ల గ్రామంలో తనిఖీలు చేపట్టారు. దొంగతనానికి పాల్పడ్డ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన మహిళలు ఇటీవల కొత్త ఇండ్లు గ్రామంలో ఓఇంటిని అద్దెకు తీసుకుని ఉన్నారన్న పక్కా సమాచారంతో పుదుచ్చేరి పోలీసులు ఇంటిని చుట్టుముట్టి తనిఖీలు చేపట్టారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన తిరుమలేష్ భార్యలు వల్లి, శారదను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి సుమారు రూ.7.5 లక్షల నగదుతో పాటు రెండు బంగారు చైన్లను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను బెంగుళూరులో సుమారు రూ.9.6 లక్షలకు విక్రయించినట్లు మహిళలు తెలపడంతో పుదుచ్చేరి పోలీసులు ఇద్దరు మహిళలను వెంటబెట్టుకుని బంగారు ఆభరణాల రికవరీ కోసం బెంగళూరు వెళ్లారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా మహిళలు దొంగతనానికి పాల్పడ్డ వృద్ధిరాలు పుదుచ్చేరిలో ఎస్పీ తాలూకు కావడంతో పుదుచ్చేరి పోలీసులు మూడు రోజుల వ్యవధిలోనే దొంగతనంను చేదించారు. కొత్త ఇండ్ల గ్రామంలో తలదాచుకుంటున్న మహిళలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇల్లు ఖాళీ చేయించిన గ్రామస్తులు

కుప్పం మండలం కొత్త ఇండ్లు గ్రామంలో మూడు నెలల క్రితం అద్దెకు దిగిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను గ్రామస్తులు ఇల్లు ఖాళీ చేయించారు. ఇంట్లో అద్దెకు వచ్చినప్పుడు నుండి అనుమానాస్పదంగానే వ్యవహరిస్తున్నారని అయితే ఇలా పాండిచ్చేరిలో దొంగతనం చేసి వస్తారని తాము ఊహించలేదని తమ గ్రామంలో దొంగలకు చోటు లేదంటూ గ్రామస్తులు ఇల్లు ఖాళీ చేయించారు.

లాటరీలు విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు

రూ.17,200లు, లాటరీ టిక్కెట్లు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర తెలిపారు. జిల్లాలో అక్రమ విక్రయాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు, జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేస్తూ, భద్రతా చర్యలు చేపట్టారు. ఈచర్యలలో భాగంగా చిత్తూరు సబ్–డివిజన్ డిఎస్పీ టి.సాయినాథ్ పర్యవేక్షణలో చిత్తూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర లాటరీ విక్రయాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు రెండు వేరువేరు చోట్ల దాడులు జరపడం జరిగింది. ఈ దాడులలో లాటరీలు విక్రయిస్తున్న భాగ్యరాజ్, రామచంద్ర, మూర్తి, సుబ్రహ్మణ్యం నలుగురు ముద్దాయిలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 17,200 రూపాయల నగదు, లాటరీ టిక్కెట్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించడం జరిగింది.

వైసిపి నాయకుడిపై కేసు నమోదు

14 రోజుల రిమాండ్



పొలంలో నరికిన శ్రీగంధం చెట్లు

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలం చిచిలివారిపల్లి గ్రామపంచాయతీ గురికివారిపల్లికి చెందిన వైసిపి నాయకులు బాలాజీ తన వ్యవసాయ పొలంలో ముళ్ళకంపలను తొలగించి భూమిని చదును చేసుకుంటున్నాడు. అయితే ముళ్ళకంపల్లో ఉన్న పది శ్రీగంధం మొక్కలను కూడా తొలగించారని, అదే గ్రామానికి చెందిన వారు పీలేరు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా పది మొక్కలు తొలగించినట్లు గుర్తించారు. శ్రీగంధం మొక్కలను స్వాధీనం చేసుకుని కేసును చిత్తూరు రేంజ్ ఆఫీసర్ థామస్ కుమార్‌కు బదిలీ చేశారు. దీంతో వారు కేసు నమోదు చేసి నిందితుడిని గురువారం పీలేరు కోర్టులో హాజరుపరచగా జడ్జి 14రోజుల రిమాండ్ విధించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ థామస్ మాట్లాడుతూ పొలాల్లోని మొక్కలను తొలగించడం నేరమని అన్నారు.

మహిళ అదృశ్యం- కేసు నమోదు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తఇండ్లు గ్రామంలో నివాసముంటున్న మంజమ్మ కుమార్తె లక్ష్మిదేవి (20)కి పది రోజుల క్రితం పెళ్లయింది. ఈనెల 26వ తేదీ నుంచి ఆమె కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో తన కూతురు కనబడటం లేదని ఫిర్యాదు చేశారు. ట్రైనింగ్ ఎస్సై జయశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని విద్యుత్తు కార్యాలయం సమీపంలోని కాలనీలో ప్రియాంక అనే మహిళ మిద్దిపైన బట్టలు ఆరేస్తుండగా 22కేవీ విద్యుత్ తీగ తగలడంతో తీవ్రంగా గాయపడింది. ఈమె డాక్టర్ విజయచందర్ భార్య. కరెంట్ షాక్‌కు గురైన ప్రియాంక చేతులు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై స్థానికులు మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో 22 కెవి లైన్ ఇళ్లపై చేతికందే ఎత్తులో ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, గతంలోనూ ఓ ఆరవ తరగతి చదివే విద్యార్థి కరెంట్ షాక్‌కు గురైన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి 22 కెవి లైన్ మార్పు చేయాలని కోరుతున్నారు.

